క్లుప్తంగా

ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపెల్లి గ్రామంలో గల సుప్రసిద్ధ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి దేవాలయానికి షరీఫ్, స్వప్న దంపతులు మైక్ సెట్, బ్లూ టూత్ స్పీకరును బుధవారం ఆలయానికి బహూకరించారు.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



పెద్దవంగర: బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి గ్రామంలోని ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని బావోజీ తండాకు చెందిన బానోతు చంద్రకళకు రూ. 1,00,116 మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు జమున, ఆర్‌ఐ లస్కర్, స్థానికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



డోర్నకల్: మండలంలోని హరాన్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడహట్యాతండాలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులకు బుధవారం సర్పంచ్ గుగులోత్ దేవిశంకర్‌నాయక్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు భూక్యా శంకర్‌నాయక్, ఉపసర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



గార్ల: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గార్లలో చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు, వీఓఏలు శోభారాణి, ఉమ, వినోద పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు పండ్ల పంపిణీ

దంతాలపల్లి: మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన మల్లం నవీన్(గణపతి) జయంతిని సందర్భంగా అతని సోదరుడు మల్లం ప్రవీణ్ బుధవారం పెద్దముప్పారం గ్రామంలో గల అమ్మఒడి అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశాడు. అనంతరం అనాథ వృద్ధులకు పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మరాపు హరీశ్, మహేష్, సైదులు, రాజేష్, రాజు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడలు

- విజేతలకు బహుమతుల అందజేత

డోర్నకల్: మూడు రోజులుగా జరిగిన సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెట్స్ పోటీలు నిర్వహించి చివరి రోజు విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ మున్వర్ అలీ,ఎంపీడీఓ అపర్ణ, ఎస్సై రవికుమార్, కౌన్సిలర్ సురేందర్‌జైన్, పీడీ శ్యాంబాబు పాల్గొన్నారు.

గార్ల: సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఎం.శివాజీచౌహాన్, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలతో పాటు, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖదీర్, తహసీల్దార్ రాము, యూడీసీ రాజేష్, కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

గూడూరు: క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని, ప్రతీ ఒక్కరు నైపుణ్యాన్ని క్రీడల్లో చూపించాలని ఎంపీపీ బానోతు సుజాత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సీఎం కప్ క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, ఎంపీటీసీ కత్తి స్వామి, ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎస్సై దిలీప్, హెచ్‌ఎం కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో సీఎం కప్ క్రీడాపోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బుధవారం ఎంపీపీ ఒలాద్రి ఉమామల్లారెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివాజీ, ఎంపీడీఓ విజయలక్ష్మి, హెచ్‌ఎం శ్రీనువాస్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.



గార్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ శివాజీ చౌహాన్



దోర్నకల్‌లో అందజేసిన సర్టిఫికెట్లతో క్రీడాకారులు



గూడూరు: సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ సుజాత



దంతాలపల్లిలో..



కురవిలో..



నెల్లికుదురులో..

కురవి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ అన్నారు. బుధవారం విజేతలకు ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ గంగాభవాని, ఎంపీడీఓ సరస్వతీ, ఎంపీఓ రఘుపతిరెడ్డి, పీఈటీలు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: సీఎం కప్ క్రీడల్లో మండల స్థాయిలో విజేతలుగా నిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి మండలం పేరు నిలబెట్టాలని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, ఎంపీడీఓ శేశాద్రి అన్నారు. మండల కేంద్రంలో విజేతలకు నగదుతోపాటు ప్రసంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వర రావు, ఎంఈఓ గుగులోతు రాము, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, ఎస్సై క్రాంతికిరణ్, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీఓ పార్థసారథి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు అనిల్, పాల్గొన్నారు.

పెద్దవంగర: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ పేరిట ఆటల పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ప్రతిభ కనబర్చిన విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు షీల్డులను అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జ్యోతిర్మయి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మండల ప్రత్యేక అధికారి కుర్షీద్, తహసీల్దార్ రమేష్ బాబు, ఎస్సై రాజు, ఎంపీఓ సత్యనారాయణ, పీఈటీలు గీత, సునీత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగరలో..

కేసముద్రం: వివిధ క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ నాగయ్య తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

అంగడి వేలం వాయిదా

తొర్రూరు: పట్టణంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారాంతపు సంత నిర్వహణకు చేపట్టే అంగడివేలం వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్ తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ రామచంద్రయ్య అధ్యక్షతన అంగడి వేలం నిర్వహించారు. ఈవేలంలో తైబజార్‌కు రూ.4.50 లక్షలు పలకగా, కమేలాకు రూ.52వేలు పలికింది. పశువుల రహదారి, గొర్రెలు, మేకల వేలంకు నిర్ణీత ధర పలకలేదు. దీంతో వాటి వేలం వాయిదా వేస్తున్నామని, తిరిగి మరో తేదీ నిర్ణయించి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గజానంద్, శంకర్, రాజయ్య పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తొర్రూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సింగారపు కుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ అధికారిగా మురళీమోహన్

డోర్నకల్: మండల వ్యవసాయ అధికారిగా ఎక్కలదవి మురళీమోహన్ నియమితులయ్యారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ అధికారిగా మురళీమోహన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో జనగాం, పాలకుర్తి మండలాల్లో విధులు నిర్వహించారు.

సదస్సును జయప్రదం చేయండి



కేసముద్రం: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కేసముద్రం: విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీన జరుగు అఖిల భారత ఆదివాసీ సదస్సు వాల్ పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ.. దేశంలో 11కోట్లకు పైగా ఉన్న ఆదివాసీలు ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి లింగ్యా, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదరిశ అనసూర్య, అరుణోదయ జిల్లా కార్యదర్శి చిట్టిమల్ల అశోక్, నాయకులు సరస్వతీ, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: ఈనెల 21 న విశాఖపట్నంలో నిర్వహించనున్న అఖిలభారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని ఆదివాసీ జిల్లా నాయకులు పూనెం భిక్షం పిలుపునిచ్చారు. సదస్సు జయప్రదం కోరుతూ బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు వెంకన్న, పుల్లన్న, సురేష్, రామ్మూర్తి, మోహన్‌రావు, రాములు, స్వామి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నర్సింహులపేట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చిర్ర సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలన్నారు. మండల కేంద్రంలో గ్రంథాలయంను మెరుగుపరచాలని, బీసీ గురుకులంను ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో వెంకన్న, యాకన్న, లింగన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు గార్లలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

గార్ల: గార్లలో ఈనెల 19న జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సభను జయప్రదం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియలు హాజరు కానున్నట్లు ఆయన వెల్లడించారు. సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ శివాజీచౌహాన్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు రమేష్, సర్పంచ్‌లు . సక్రు, శంకర్, అమర్‌చంద్ పాల్గొన్నారు.

రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏడీఏ శోభన్‌బాబు

దంతాలపల్లి: రాబోయే వానకాలం పత్తి, వరి విత్తనాలు, మందు బస్తాలు, తదితర వ్యవసాయ సంబంధిత వస్తువులను కొనుగోలు చేసే ప్రతి రైతుకు తప్పక రశీదులు ఇవ్వాలని ఏడీఏ శోభన్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోగల రైతు వేదికలో విత్తనాల, ఎరువుల షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వానాకాలంలో సాగుకు సంబంధించిన విత్తనాలలో షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. అధికృత పత్తివిత్తనాలను మాత్రమే మార్కెట్లో ఉంచాలన్నారు. విత్తనాలకు సంబంధించిన లైసెన్స్‌లను నిల్వ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి త్వరలో ధాన్యం తరలించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కుమార్‌యాదవ్, పీఏసీఎస్ సీఈఓ వెంకన్న, యజమానులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గుండెపోటుతో యువకుడి మృతి



కేసముద్రం: గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కేసముద్రంవిలేజీలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కందుకూరి శంకర్(27) ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో, వరంగల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య సుప్రజ, కుమారు నిహన్ ఆదిత్య ఉన్నారు. కాగా తండ్రి చనిపోయిన విషయం తెలియని ఆ చిన్నారి నాన్న నాన్నా అంటూ పిలుస్తుండడంతో, అక్కడున్న వారందరు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న వరిగడ్డి దగ్ధం



తొర్రూరు రూరల్: వ్యవసాయ పొలం నుంచి ట్రాక్టర్‌పై ఇంటికి తరలిస్తున్న వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని కొమ్మనపెల్లి తండ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తండాకు చెందిన భూక్య బాసు అనే రైతు తన పొలంలోని వరి గడ్డిని ట్రాక్టర్ ద్వారా ఇంటికి తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు తాకడంతో మంటల్లో సుమారు 250 గడ్డి మోపులు, ట్రాక్టర్ డబ్బా కాలిపోతుండగా స్థానికులు నీళ్లు పోస్తూ మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే వరిగడ్డి, ట్రాక్టర్ డబ్బా కాలిపోయింది. తీవ్రనష్టం వాటిల్లడంతో బాధిత రైతు, ట్రాక్టర్ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

చిట్‌ఫండ్ యాజమానిపై చీటింగ్ కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ఖాతాదారులను మోసం చేశారనే ఫిర్యాదు మేరకు జిల్లా కేంద్రంలోని శ్రీయాదాద్రి చిట్‌ఫండ్స్ యజమానిపై చీటింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యంనగర్ కాలనీకి చెందిన చుంచు నాగరాజుతో పాటు మరో 18 మంది శ్రీయాదాద్రి చిట్‌ఫండ్స్‌లో చిటీలు కట్టారు. ఇందులోనే చుంచు నాగరాజు 2017 మార్చి 20వ తేదీన రూ.5లక్షల చీటిని 50నెలల కాలంలో కట్టాడు. అందుకు సంబంధించిన డబ్బులు మొత్తం రూ.5లక్షలు ఇవ్వకుండా శ్రీయాదాద్రి చిట్‌ఫండ్స్ చైర్మన్, ఎండి రాయరాకుల శ్రీనివాస్ (హైదరాబాద్‌లోని కాప్రా పరిధిలో గల కనకదుర్గ గుడి దగ్గర కృషి గార్డెన్స్ నివాసం) సతాయిస్తున్నాడు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారైన మొత్తం 18 మంది డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతూ తిరిగినప్పటికీ ఆయన స్పందించకపోగా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితులకు రూ.90లక్షలు రావాల్సి ఉండగా ఏడాది కాలంగా వారు డబ్బుల కోసం తిరిగి న్యాయం జరుగకపోవడంతో మహబూబాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు యజమాని డబ్బులు తీసుకుని పారిపోయాడని అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదు కోరారని సీఐ తెలిపారు.

గృహహింసపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: భార్య వేధింపులకు గురి చేస్తున్న భర్త, వారి కుటుంబ సభ్యులపై గృహహింస చట్టంలో భాగంగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్‌రోడ్డు స్తూపం వద్ద నివాసం ఉండే ఎస్‌కె పర్వీన్‌కు గూడూరు మండలంలోని భూపతిపేట మండలానికి చెందిన ఎస్‌కె సలీంతో 2007లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. వివాహం జరిగిన రెండేళ్ల నుంచి ఆమెను భర్త సలీంపాష, అత్త బీపాష, మామ హుస్సేన్ తదితరులు అదనపు కట్నం తీసుకురావాలని వేదింపులకు గురి చేస్తున్నారు. ఆమె బతికి ఉండగానే ఆమె చెల్లెలు రేష్మాను సలీంపాష ఏడేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి పర్వీన్‌ను అతడు వారి పిల్లల వద్దకు రాకపోగా వారి ఆలనాపాలన చూసుకోవడం లేదు. దీంతో తనను అదనపు వరకట్నం తీసుకురావాలని వేదించడం, రెండో పెళ్లి చేసుకుని తనను మోసం చేసిన భర్త సలీంపాష, అత్తమామలు బీపాష, హుస్సేన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన టౌన్ ఎస్సై వి.దీపికారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

కురవి: ఇంట్లో ఎవరు లేని సమయంలో పట్టపగలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని బాదె శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో ఈజీఎస్‌లో ఈసీగా విధులు నిర్వహించే కైలా, భర్త కిషన్‌లుపై అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. భార్యాభర్తలు ఇద్దరు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువా తాళం తీసి అందులో ఉన్న 5తులాల బంగారు, 8తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో మాలోత్ కిషన్ ఇంటికి వచ్చాడు. ఇంటికి వేసి ఉన్న తాళం తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళం తీసి ఉంది. అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో లబోదిబోమంటూ కురవి పోలీసులకు సమాచారం అందచేశారు. ఎస్సై బి.రాము, క్లూస్‌టీం బృందం చోరీ జరిగిన ప్రదేశానికి వచ్చి పరిశీలించారు. మాలోత్ కైలా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాము తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కేసముద్రం: మండలంలోని తావుర్యాతండాజీపీ శివారు దుబ్బతండాకు చెందిన యాకుబ్ అనే వ్యక్తి, ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లికి చెందిన కార్తీక్ అనే వ్యక్తి, బైక్‌లపై వెళ్తుండగా ప్రమాదవశాత్తుగా కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మానుకోట ఆస్పత్రికి తరలించారు.

అగ్గిపాలైన మొక్కజొన్న పంట



కేసముద్రం: ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పంట తీరా చేతికొచ్చిన దశలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైన సంఘటన ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాలోతు రాజు అనే రైతు తన రెండెకరాల మొక్కజొన్న పంటలో కంకులను విరిచి నూర్పిడి కోసం కుప్పగా పోశాడు. పక్కనున్న ఓ రైతు మొక్కజొన్న చొప్పకు నిప్పుపెట్టి వెళ్లిపోగా, ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి కుప్పగా పోసిన మొక్కజొన్న కంకులకు ఆంటుకుని దగ్ధమైంది. అప్పటికే రైతులు మంటలను ఆర్పేప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది.

లేఅవుట్ లేకుండానే ప్లాట్ల విక్రయం

- కనీసం నాలా అనుమతులు కూడా పూర్తి స్థాయిలో లేకుండానే..
- లేఅవుట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లుగా ప్రచారం
- నష్టపోతున్న కొనుగోలుదారులు
- అధికారులకు తలనొప్పిగా మారిన వ్యవహారం
- ప్రభుత్వ ఆదాయానికి గండి



భవానిశంకర్ తండా సమీపంలో నాలా అనుమతులు, లేఅవుట్ అనుమతి లేకుండా చేసిన వెంచర్

మహబూబాబాద్: పేదల అనుమతి లేకుండా చిన్న ఇంటి నిర్మాణం చేపడితే వెంటనే సమాచారం తెలుసుకుని పని చేసే సామగ్రిని ఎత్తుకెళ్లడం పనులు ఆపేస్తారు. కాని జిల్లా కేంద్రంలో నాలుగు ఎకరాలలో ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లు చేసి విక్రయాలు చేస్తుంటే మాత్రం సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఎందుకంటే ఆ వెంచర్లు చేసే వారిలో ఎక్కువ మంది ఎంపీ, ఎమ్మెల్యే అనుచరులే ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. వారి వ్యవహారంతో కొనుగోలుదారులు నష్టపోవడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండితోపాటు చివరికి గ్రీన్ ల్యాండ్ పరంగా కూడా నష్టపోవాల్సి వస్తుంది. వివాదాస్పద భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎంపీ ఎమ్మెల్యే అనుచరులు కోట్ల రూపాయలు దండుకుంటున్నారు.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా కేంద్రం కావడంతో పట్టణ విస్తీరణం రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా కేంద్రం శివారు 18వ వార్డు పరిధిలో భవాని శంకర్ తండా సమీపంలో నాలుగు ఎకరాల్లో వెంచర్ చేసిన రియల్టర్లలో ఎక్కువ మంది ఎంపీ, ఎమ్మెల్యే అనుచరులే ఉన్నారు. సర్వే నెంబర్ 134లో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేయగా దానిలో కేవలం 8మంది పేరున వేర్వేరుగా నాలా అనుమతులు తీసుకున్నారు. ఎనిమిది మంది పేరున మొత్తం రెండున్నర ఎకరాలు మాత్రమే నాలా అనుమతి తీసుకుని నాలుగు ఎకరాలలో ప్లాట్లు చేశారు. ఈఏడాది ఏప్రిల్ 24న నాలా అనుమతులు తీసుకున్నట్లు తహసీల్దార్ కార్యాలయం రికార్డులో ఉంది. కేవలం రోడ్డు పరంగా మట్టి పోసి ముందుగా సుమారు 50ప్లాట్లు చేసి దానిలో ఇప్పటికే పది ప్లాట్లను విక్రయించారు. గజం రూ.12,500 నుంచి రూ.11,000 వరకు విక్రయాలు చేస్తున్నారు. లేఅవుట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లుగా మ్యాప్‌లో ఉంది. దానిని చూసి త్వరలోనే లేఅవుట్ అనుమతులు వస్తాయని నమ్మించి విక్రయాలు చేస్తున్నారు.

కొనుగోలు చేయొద్దు

లేఅవుట్ లేని ప్లాట్లను కొనుగోలు చేయొద్దు. కొనుగోలు చేస్తే ఆర్థికంగా నష్టపోవడంతోపాటు అనుమతులు ఇవ్వడం జరగదు. అనధికారిక వెంచర్లు చేస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకుంటాం. క్రిమినల్ కేసులు పెడతాం. గతంలోనే నోటీసులు జారీ చేశాం. వెంచర్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి హద్దు రాళ్లను తొలగిస్తాం.

– నవీన్, టౌన్ ప్లానింగ్, మానుకోట

పూర్తి స్థాయిలో తీసుకోవాలి

చాలా మంది రియల్టర్లు నాలా అనుమతులు పూర్తి భూమికి తీసుకోకుండా కొంత భూమికి తీసుకుని వెంచర్లు చేస్తున్నారు. భవాని శంకర్ తండా సమీపంలో ఉన్న వెంచర్‌కు కూడా రెండున్నర ఎకరాల నాలా అనుమతి మాత్రమే ఉంది. ఆ వెంచర్‌ను పరిశీలించి నాలా అనుమతి ప్రకారం లేకుంటే చర్యలు తీసుకుంటాం.

– సంజీవ, సర్వేయర్, మానుకోట

మానుకోటకు వీరబ్రహ్మేంద్రస్వామి వంశీకుడి రాక



మహబూబాబాద్ రూరల్: వీరబ్రహ్మేంద్రస్వామి వారి కుమార్తె వీరనారాయణమ్మ సంతతికి చెందిన ఎనిమిదో తరం ముని మనుమడు బ్రహ్మశ్రీ వీరం బోట్లయ్యచారి జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయానికి సందర్శనార్థం బుధవారం వచ్చారు. వారిని దేవాలయం ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ పమ్మి సనాతన చారి అనురాధ, ప్రధాన కార్యదర్శి తాడూరు మాధవాచారి గీతాదేవి దంపతులు, కోశాధికారి మోత్కూరి శంకర్, ఉపాధ్యక్షులు సోమయ్య, సహాయ కార్యదర్శి అరెందుల వెంకటేశ్వర్లు, పమ్మి ధనుంజయ చారి, దేవాలయం ట్రస్ట్ ఘనంగా సన్మానించారు.